క్లుప్తంగా

సి.బెళగల్ ఎంపీడీఓగా రాముడు



ఎంపీడీఓగా బాధ్యతలను స్వీకరిస్తున్న రాముడు

సి.బెళగల్: సి.బెళగల్ ఎంపీడీఓగా రాముడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ విధులు నిర్వరిస్తున్న ఎంపీడీఓ అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. మండల పరిషత్ కార్యాలయ కార్యానిర్వహణ అధికారి శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓను కలిసి అభినందనలు తెలిపారు.

కోడుమూరు ఎంపీడీఓగా చంద్రశేఖర్



కోడుమూరు రూరల్: కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చంద్రశేఖర్ అనంతపురం జిల్లాకు బదిలీకాగా ఈయన స్థానంలో అక్కడి నుంచి ఇక్కడి వచ్చిన దివ్య ఇప్పటి వరకు ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తించారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్: ఉపాధి హామీ పథకం కింద నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. మంగళవారం కోడుమూరులోని మదర్‌సా, ఆలయ ప్రాంగణాల్లో ఉపాధి పథకం కింద నాటిన మొక్కలను ఏపీఓ పరిశీలించారు. బ్లాక్ ప్లాంటేషన్ కింద 500మొక్కలను నాటించడం జరిగిందని ఈ సందర్భంగా ఏపీఓ గుర్తు చేశారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ రాముడు క్యాదర్శులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో పీఎస్‌లతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. పల్లెల్లో పండుగ వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, వేడుకలలో విద్యార్థులను భాగస్వాములను చేయాలని సూచించారు. పీఎస్‌లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లను సమన్వయం చేసుకుని స్థానిక పరిపాలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, ఆటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు.


మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, అధికారులు

సి.బెళగల్: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంపీపీ బొంతల మునెప్ప సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం యాంటీ డ్రగ్స్‌పై ఎంపీడీఓ రాముడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంపై పోలీస్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ యువత శక్తితోనే సమాజాభివృద్ధి సాధ్యమని, మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు, పొదుపు మహిళలతో ఎంపీపీ, ఎంపీడీఓ ప్రతిజ్ఞ చేయించారు.

ఏపీ వీబీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా రమణయ్య



ఓర్వకల్లు: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం (ఏపీ వీబీఎస్) రాష్ట్ర కార్యదర్శిగా హుసేనాపురం గ్రామానికి చెందిన కాటనేని రమణయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని రమణయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి నాయడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల శ్రీనివాసులు, వాల్మీకీ కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తమ వంతు కృషి చేస్తామన్నారు.

కత్తి పోటా.. తుపాకీ తూటానా?

- యువకుడి హత్య ఘటనలో భయానక నిజాలు
- మృతుడి తలలో బుల్లెట్
- పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు
- నంద్యాల డీఎస్పీ పర్యవేక్షణలో విచారణ



సోమవారం హత్యకు గురైన యువకుడి మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

పాణ్యం: పాణ్యం ఎస్సార్బీసీ కాల్వ వద్ద సోమవారం హత్యకు గురైన యువకుడిని మృత దేహంపై ఉన్న గాయాల ఆధారంగా పోస్టుమార్టం అనంతరం కొత్త కోణం వెలుగు చూసింది. యువకుడిని గొంతుపై భారీ గాయం ఉండడతో అందరు గొంతుకోసి హత్య చేశారని భావించారు. పోస్టుమార్టంలో తలలో బుల్లెట్ ఉండడంతో యువడిని పిస్టల్‌తో కాల్చి చంపినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా సోమవారం రాత్రి నుంచి డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి వారిని పాణ్యం సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ రవింద్రానాథ్‌రెడ్డి విచారిస్తున్నారు. ఈ విచారణలో పలు భయానక విషయాలు బయటికొచ్చినట్లు సమాచారం. హత్యకు గురైన యువకుడిది గుంతకల్లుగా గుర్తించారు. హతడుతో పాటు మరో 8మంది యువకులు నేరాలే ప్రవృత్తిగా జీవిస్తున్నారు. వీరిందపై కేసులు అధికంగా ఉన్నట్లు తెలుస్తుంది. పగలు గ్రామాల్లో పర్యటించడం, రాత్రి వేళ ఒంటరివాళ్లు, వీధుల్లో చివరి ఇళ్లనే టార్గెట్ చేసి దొంగతనం చేస్తున్నారు. ఇలాంటి కేసులు ఆ యువకులపై చాలా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆదివారం వారు నంద్యాల చేరుకుని అక్కడి నుంచి పాణ్యంలో మద్యం తీసుకున్నారు. బైక్‌లపై ఎవ్వరు చూడని ప్రదేశంలో మద్యం సేవించి దొంగిలించిన సొమ్ము పంపకాలు చేపట్టినట్లు సమాచారం. అయితే పంపకాల్లో తేడా రావడంతో వారి మధ్య ఘర్షణ జరిగి తుపాకీతో కల్చినట్లు అనుమానితులు ఒప్పుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత తుపాకీని పక్కనే ఉన్న ఎస్సార్బీసీ కాల్వలో పడేసినట్లు అంగీకరించారు. దీంతో పోలీసులు గజఈతగాళ్లను కాల్వలో దింపి తుపాకీ కోసం గాలించారు. ఈ కేసుల్లో ఇంకా చాలా మంది ఉన్నట్లు గుర్తించారు. వారిని కూడా అదుపులోకి తీసుకోని విచారించాల్సి ఉంది. పాణ్యం సర్కిల్ కార్యాలయంలో అత్యంత గోప్యంగా ఈ విచారణ చేపడుతున్నారు. డీఎస్పీ, ప్రత్యేక బృందం సభ్యులు మాత్రమే విచారణ చేస్తున్నట్లు సమాచారం.



పాణ్యం సర్కిల్ కార్యాలయం వద్ద డీఎస్పీ వాహనం

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని అన్ని వార్డులలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 31వ వార్డు రాఘవేంద్రనగర్‌లో డ్రైనేజీలు, రోడ్లు తదితర అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ రామయ్య మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో ప్రాధాన్యతలను అనుసరించి అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ మేయర్ రేణుక, స్థానిక కార్పొరేటర్ (స్టాండింగ్ కమిటీ సభ్యులు) మిద్దె చిట్టెమ్మ, మున్సిపల్ అధికారులు, టీడీపీ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: మండలంలోని కంబదహాల్‌లో గ్రామాభివృద్ధి ప్రణాళికల శిక్షణపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల (పీఎస్‌ల)కు ఈఓఆర్డీ సందీప్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండవ రోజు మంగళవారం ఈఓఆర్డీ చెత్త నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ రాముడు శిక్షణను పరిశీలించారు. గ్రామంలోని చెత్త సేకరణ, షెడ్‌కు తరలింపు, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ఆదాయ పొందే అంశాలను వారు వివరించారు. పీఎస్‌లు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి పరచాలని సూచించారు. అనంతరం అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పీఎస్‌లు చెత్త సేకరణ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు.

నేటి నుంచి హెల్తీ బేబీ పోటీలు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఎన్ఆర్ పేటలో ఉన్న జీవీఆర్ చిన్నపిల్లల హాస్పిటల్‌లో ఈ నెల 14వ తేదీ నుంచి సెప్టెంబర్ 14వ తేదీ వరకు హెల్తీ బేబీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.భువనేశ్వరి, చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ జీఎస్.రామప్రసాద్ వెల్లడించారు. మంగళవారం హాస్పిటల్‌లో వారు మాట్లాడుతూ.. ఈ పోటీలు రెండు కేటగిరీల్లో నిర్వహిస్తామని, ఏడాది లోపు ఒక కేటగిరి, 1 – 3 ఏళ్ల వయస్సున్న చిన్నారులకు ఒక కేటగిరీ ఉంటాయన్నారు. సెప్టెంబర్ 17న పేషంట్స్ సేఫ్టీ డే రోజున విజేతల వివరాలు ప్రకటిస్తామని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కల్లూరు: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి పేర్కొన్నారు. కల్లూరు మండల పరిధిలోని చిన్నటేకూరు, ఉలిందకొండ గ్రామాల్లో మంగళవారం ప్రజా వినియోగ సేవలపై శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో వితంతు పింఛను, మానసిక అనారోగ్య వ్యక్తుల హక్కుల గురించి వివరించారు. కోర్టులో వ్యాజ్యము దాఖలు చేయకముందే శాశ్వత పీఠమును ఆశ్రయించవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) నాగరాజు నాయుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు

- ఎంపీపీ బొంతల మునెప్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప

సి.బెళగల్: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదని, ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బొంతల మునెప్ప అధికారులను హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ రాముడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అనారోగ్యంతో మృతి చెందిన పలుకుదొడ్డి సర్పంచ్ లక్ష్మీదేవమ్మకు నివాళులర్పిస్తూ సభ్యులు రెండు నిమిషాలు మౌనంపాటించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధిని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ఉన్నప్పటికీ వర్షాపాతం 66 ఎంఎం లోటుందని ఏఓ మల్లేష్‌కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. పశువులకు టీకాలు సిద్ధంగా ఉన్నాయని పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, బీటీ రోడ్డు నిర్మాణాలు ప్రాధాన్యత మేరకు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు గోనెనాయక్, గోపాలరావుకు ఎంపీడీఓ సూచించారు. రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పిస్తామని వెలుగు ఏపీఎం వెంకటస్వామి సభకు తెలిపారు. అదేవిధంగా మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఎంపీపీ అధికారులకు సూచించారు. మండల మీట్‌లో వైస్ ఎంపీపీ తలారి బీసమ్మ, మండల పరిషత్ కార్యాలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, ఏపీఓ లక్ష్మన్న, ఐసీడీఎస్ సీడీపీఓ వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై మండిపడిన సభ్యులు

ప్రజా సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఎంపీపీ బొంతల మునెప్పతోపాటు సభ్యులు మండి పడ్డారు. రైతుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఇరిగేషన్ అధికారులు సూర్యప్రకాష్, ధర్మేంద్రలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులు, పంట కాలువల మరమత్తులు పట్టించుకోవడం లేదని, కనీసం ప్రతిపాదనులు సైతం రూపొందించకుంటే ఎలా అని నిలదీశారు. ప్రైవేట్ స్కూల్ అనుమతి లేకుండా నడుపుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఎంఈఓ ఆదాం బాషాను కొత్తకోట సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు మణిమోహన్‌రెడ్డి తదితరులు ప్రశ్నించారు. ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు ఆరేళ్లలోపు చిన్న పిల్లలను కూడా చేర్పించుకుంటుంటే ఏమి చేస్తున్నారన్నారు. మినీ గోకులం బిల్లుల మంజూరులోనూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సభ్యులు మండిపడ్డారు.

దేశ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలి



బైక్ ర్యాలీలో పాల్గొన్న యువకులు, నాయకులు

కల్లూరు: ప్రతి పౌరుడు దేశ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని బీజేపీ నాయకులు చెన్నయ్య, నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి బళ్ళారి చౌరస్తా, కృష్ణానగర్, నంద్యాల చెక్‌పోస్టు వరకు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రవితేజ ధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామమద్దిలేటి, రామకృష్ణ, గంగాధర్, నటిష్ కుమార్, శ్రీనివాసులు, రామ్మోహన్‌రెడ్డి, రమణ యాదవ్, రామకృష్ణ, చంద్ర వర్ధ, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు స్థలం విషయంలో జోక్యం తగదు



మాట్లాడుతున్న 34వ వార్డు కార్పొరేటర్ వెంకటేశ్వర్లు

కల్లూరు: కోర్టులో విచారణ జరుగుతున్న స్థలం విషయంలో టీడీపీ నాయకులు జోక్యం తగదని కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు, కో-ఆప్షన్ మెంబర్ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం సాయంత్రం 34వ వార్డులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్ 34వ వార్డు నిర్మల్‌నగర్ పార్కు సమీపంలో ఉన్న స్థలంలో గతంలో కొంత మంది పేదలకు ఇంటి పట్టాలు మంజూరయ్యాన్నారు. అయితే మున్సిపాలిటీ అధికారులు ఆ స్థలం మున్సిపాలిటీకి చెందినదన్నారు. ప్రస్తుతం ఈ విషయం కోర్టులో నడుస్తోందన్నారు. అయితే కొన్ని రోజులు క్రితం టీడీపీ నాయకులు మాదన్నతో పాటు కొంతమంది స్థలాన్ని క్లీన్ చేసి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేయడమే కాకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు. కోర్టు తీర్పు ఎవరి వైపు వచ్చినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. వార్డులో ఎవరైనా అభివృద్ధి పనులు చేస్తే సహకరిస్తామన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గౌరు చరిత ఆదివారం సాయంత్రం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.15 లక్షల ఉపాధి హామీ నిధులతో గ్రామంలో రెండు చోట్ల సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ, మల్లెల రాజశేఖర్, చంద్రపెద్దస్వామి, సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గార్గేయపురం రోడ్డును పునర్నిర్మించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: అస్తవ్యస్తంగా మారిన కేతవరం- గార్గేయపురం రోడ్డును పునర్నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల ప్రజలతో కలిసి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, మండల కార్యదర్శి నాగన్న తదితరులు మంగళవారం ఎమ్మెల్యే గౌరు చరితకు వినతి పత్రం అందజేశారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, ఇప్పటికైనా రోడ్డు నిర్మించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో శాఖా కార్యదర్శి శ్రీధర్, మండల కమిటి సభ్యులు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, పార్టీ సభ్యులు రంగస్వామి, వెంకటస్వామి, నాగరాజు, బుగ్గరాముడు, కృష్ణ, గఫార్‌మియా, మద్దిలేటి, బలరాముడు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏఓ జయప్రకాష్‌రెడ్డి

పాణ్యం: ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఏఓ జయప్రకాష్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఎంఆర్‌సీ భవనంలో క్షేత్రస్థాయి వ్యవసాయశాఖ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 1,501 కౌలు కార్డులు అందజేయాలన్నారు. ఆ దిశగా అధికారులు కౌలు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతు సేవా కేంద్రంలో రైతులు పొలం పాస్‌బుక్, వన్‌బీ, ఆధార్, ఫోన్‌నంబర్, పంట పేరు, నీటి వనరు పేరు, తదితర వివరాలు తెలుపాలన్నారు. రైతులు ఈ - క్రాప్ బుకింగ్‌కు సహకరించాలని సూచించారు.

మ్యాట్‌ల పంపిణీ



మ్యాట్లను అందజేస్తున్న రవి నాయక్

కల్లూరు: హార్ట్ టూ హార్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని చిన్నటేకూరులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఐఐటీ-నీట్ అకాడమీకి రూ.10 వేలు విలువ మ్యాట్లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే మ్యాట్‌లను అందజేసిన ట్రస్ట్ అధ్యక్షుడు రవి నాయక్‌ను అకాడమీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రత్యూష అభినందించారు.

చెత్త నుంచి సంపద తయారు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీ కేంద్రానికి తరలించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువును తయారు చేసి సంపద సృష్టించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామీణ అంశాలపై రెండవ రోజు శిక్షణ చిన్నటేకూరు ఎస్‌డబ్ల్యూపీసీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పారిశుద్ధ్యంపై క్లాప్ మిత్రాలకు, కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వం కల్తీ మయం!

- దుకాణాల్లో నాణ్యత లేని చిరుతిండ్లు
- ప్యాకెట్ తినుబండారాలతో పొంచి ఉన్న ముప్పు
- చిన్నారుల పాలిట శాపాలుగా మారుతున్న వైనం
- కనీస తనిఖీలు చేయని అధికారులు

గడివేముల: సర్వం కల్తీ మయం అవుతున్నాయి. ప్రతి వస్తువునూ కల్తీ చేస్తున్నారు కొందరు అక్రమార్కులు. నిత్యావసర సరుకులే కాదు గృహ వినియోగ వస్తువులు సైతం డూప్లికేట్ వస్తున్నాయి. నిజమైన కంపెనీలను తలదన్నేలా అదేపేరుపై డూప్లికేట్ వస్తువులు రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిరుతిండ్లు పూర్తిస్థాయిలో కల్తీ అవుతన్నాయి. చిన్నారులనే లక్ష్యంగా చేసుకుని ఆకర్షించే రంగులతో రకరకాల ప్యాకెట్లలో స్నాక్స్ తయారు చేసి షాపులకు సరఫరా చేసి విక్రయిస్తున్నారు. చిన్నారులు వాటి వైపు ఆకర్షితులై అనారోగ్యం బారిన పడుతున్నారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో దుకాణాల్లో ఎక్కడా చూసినా నాణ్యత లేని ఆహార పదార్థాల ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. వ్యాపారుల జిమ్మిక్కులతో పిల్లలను ఆకట్టుకునే కార్టూన్ రంగుల ప్యాకింగుల్లో చిరుతిండ్లు మెరుస్తున్నాయి. వీటిని చూడగానే కొనివ్వాలంటూ చిన్నారులు మారం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు కొనుగోలు చేసి ఇస్తున్నారు. చివరకు అవి చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటి వలన భవిష్యత్ పెనుముప్పు తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఓ దుకాణంలో విక్రయిస్తున్న చిరుతిండ్ల ప్యాకెట్లు

విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలు

ధనార్జనే ధ్యేయంగా సకిలీ చిరుతిండ్లను విచ్చలవిడిగా మార్కెట్లోకి వదులుతున్నారు. స్నాక్స్ ప్యాకెట్లుగా వాటిని చలామణి చేస్తున్నారు. వాటిపై తయారయ్యే ప్రాంత చిరునామా, ఎంఎఫ్‌డీ కూడా ఉండదు. సంస్థ పేర్లు కూడా అర్థం కాని రీతిలో ఉంటాయి. మరికొన్ని అయితే ప్రముఖ కంపెనీల పేరును పోలి ఉంటూ మార్కెట్లోకి వస్తున్నాయి. చూడ గానే తినాలనిపించే రకంగా వాటిని తయారు చేస్తున్నారు. విచ్చలవిడిగా దుకాణాల్లో ప్యాకెట్లను వేలాడతీసి అమ్ముతున్నారు. వీటికి సంబంధించి మండలంలో ప్రతిరోజూ వేలాది రూపాయల్లో వ్యాపారం జరుగుతోంది. అయితే అధికారులు చేయనందునే నాణ్యతలేని తినుబండారాలు మార్కెట్‌లోకి వస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాసిరకంతో అనారోగ్యం

నాసిరకం తినుబండారాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎక్కువ రోజుల నిల్వ ఉండాలనే ఉద్దేశంతో తినుబండారాలలో వివిధ రకాల కెమికల్స్ వాడుతున్నారు. రుచి కోసం ఎక్కువ మోతాదులో మసాలా, ఆకర్షణీయమైన రుంగుల కోసం ప్రమాదకర పొడర్లు కూడా వినియోగిస్తున్నారు. వీటిని తినడం వలన భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తప్పవు. ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. – డాక్టర్ మొల్లా జబీన్,గడివేముల

విద్యార్థులకు అవగాహన కల్పించాలి



పిల్లలకు ప్రమాదకరమైన చిరుతిండ్లు ఇళ్లలో, పాఠశాలల్లో నివారించాలి. సహజసిద్ధమైన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వాలి. రెడీమేడ్ వాటి జోలికి వెళ్లకుండా పిల్లల్ని ఉంచడం ఉత్తమం. పిల్లలు మారాం చేసినా వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి, చిరుతిండ్లకు చిన్నారులను దూరంగా ఉంచేందుకు పాఠశాలల్లో అవగాహన కల్పించాలి. – డి.యాసిన్, గడివేముల

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



వర్మీ యూనిట్‌లను పరిశీలిస్తున్న డీపీఓ మంజులవాణి

పాణ్యం: ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీపీఓ మంజులవాణి సూచించారు. మంగళవారం పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిని రిఫ్రెష్ ట్రైనింగ్ ప్రొగ్రామ్‌కు డీపీఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయితీలో వర్మీ యూనిట్‌లు మెరుగుపడాలన్నారు. ప్రతి రోజూ ఆయా పంచాయితీ కార్యాలయ సిబ్బంది వర్మీ యూనిట్‌ల తీరుపై సమీక్ష చేయాలన్నారు. అలాగే నిత్యం వర్మీ యూనిట్‌లు పని చేస్తుంటే గ్రామాలు శుభ్రంగా ఉంటాయన్నారు. ఆయా గ్రామాల్లో ప్లాస్టిక్, గాజు, ఇనుప ముక్కలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పరిశుభ్రత పాటించేలా చైతన్య పరచాలని పంచాయతీ కార్యదర్శులకు ఈ సందర్భంగా డీపీఓ సూచించారు. అనంతరం తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియను డీపీఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దస్తగిరి, ఈఓఆర్డీ సులోచన, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.